పింఛన్ నగదు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



శ్రీహరిపురం యూనియన్ బ్యాంక్ వద్ద పోలీసు బందోబస్తు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో జూలై ఒకటో తేదీన పింఛన్ నగదు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ సచివాలయాల పరిధిలో 6,783 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని పేర్కొన్నారు. ఇందు కోసం రూ. 4.47 కోట్లను పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే గ్రామ సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

పింఛన్ల సొమ్ము పంపిణీకి చర్యలు

ముదినేపల్లి రూరల్: జూలై ఒకటో తేదీన పింఛన్ల సొమ్ము పంపిణీ చేసేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మండలంలో తొమ్మిది వేల మందికి పైగా లబ్ధిదారులకు రూ.6.12 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. వీటిని సోమవారం పంపిణీ చేయాల్సి ఉండగా ఆదివారం సెలవు కావడంతో బ్యాంకు ద్వారా పంచాయతీ కార్యదర్శులకు శనివారమే ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ నగదు మొత్తాన్ని శ్రీహరిపురం యూనియన్ బ్యాంక్‌లో భద్రపర్చగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై డి.వెంకటకుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

ఇంటి వద్దే పింఛన్ అందజేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: జూలై ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందజేస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో 28,888మంది లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందించనున్నట్లు పేర్కొన్నారు. అవ్వ, తాతలకు పెంచిన పింఛన్ రూ.4వేలతో పాటు మరో రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలు అందజేయనున్నట్లు తెలిపారు. సోమవారం పెన్షన్ తీసుకోలేని లబ్ధిదారులకు మంగళవారం అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.

కేసుల పరిష్కారంలో రాజీమార్గం ఉత్తమం



గుడివాడలో కక్షిదారుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి సుజాత

గుడివాడ టౌన్: కొన్ని అనుకోని సంఘటనలు, తాత్కాలిక ఆవేశాలకు కక్షిదారులు కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని, వాటిని రాజీ మార్గంలో పరిష్కరించడం ఉత్తమమని 11వ అదనపు జిల్లా ఇన్‌చార్జి జడ్జి ఎస్.సుజాత అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌కు సంబంధించి నాలుగు బెంచీలు ఏర్పాటు చేయగా 104 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తి తెలిపారు. ఇందులో సివిల్ 17, క్రిమినల్ 82, పీఎల్‌సీ కేసులు 5 పరిష్కరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బి.లక్ష్మీనారాయణ, జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి, మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి.గాయత్రి పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ శనివారం లోక్‌అదాలత్ జరిగింది. ముందుగా కక్షిదారుకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్న చిన్న ఘర్షణలకు కోర్టులు చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బును వృథా చేసుకోకుండా అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. కోర్టు పరిధిలో క్రిమినల్, ఎన్ఐ యాక్టు, ఎంసీ కేసులు, ఎక్సైజ్, సివిల్, పీఎల్‌సీ వంటి 108 కేసులను పరిష్కరించి, రూ.86,27,920 నగదును కక్షిదారులకు అందించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివకిరణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలు ఆన్‌లైన్ చేయాలి



శ్రీహరిపురం ఆర్బీకే వద్ద సిబ్బందితో ఏడీఏ

ముదినేపల్లి రూరల్: మండలానికి కేటాయించిన మట్టి నమూనాలను త్వరితగతిన ఆన్‌లైన్ చేసి సంబంధిత ల్యాబ్‌లకు పంపాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి కోరారు. మండలంలోని ముదినేపల్లి, శ్రీహరిపురం రైతుభరోసా కేంద్రాల్లో పీఎం కిసాన్ ఈకేవైసీ వెరిఫికేషన్ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయకులతో ఏడీఏ మాట్లాడుతూ ఈకేవైసీ పనులను మట్టి నమూనాల ఆన్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సార్వా సాగుకు సంబంధించి వరి విత్తనాలు పలు గ్రామాల్లో వెదజల్లుతున్నందున ఈ సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు విత్తన శుద్ధిపై సూచనలు ఇవ్వాలన్నారు. ఏడీఏ వెంట మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ ఉన్నారు.

‘సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా’



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

గుడివాడ టౌన్: పట్టణంలో ప్రధాన సమస్యలైన తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు తన దృష్టికి వచ్చాయని వాటి పరిష్కారానికి శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఆయన స్థానిక పెద ఎరికపాడులోని హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి సరఫరా విధానం, ఏలూరు రోడ్ ప్రధాన డ్రెయిన్‌లో సిల్టు తీసే విధానాన్ని శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటిని శుద్ధిచేసే వ్యవస్థను పరిశీలించి, వాటిని మెరుగుపర్చే అంశాలను తమ దృష్టికి తెస్తే ఏర్పాటు చేస్తామన్నారు. ఇకపై టిడ్కో ఇళ్లకు ట్యాంకర్ల ద్వారా కాకుండా నేరుగా నీటిని పంపే ప్రక్రియ ప్రారంభించామన్నారు. ప్రతి ఏటా వేసవిలోనే సిల్టు తొలగించి వర్షాలు రాక ముందే డ్రెయిన్లు మెరుగుపరుస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పామర్రు ఎమ్మెల్యే



పామర్రు: కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలో కలెక్టర్‌ను కలిసి ఆయనకు నియోజకవర్గంలోని సమస్యల వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం తగు విధమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, అనగాని మురళీకృష్ణ, సందీప్, శ్రీను, చాట్ల రమేష్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముదినేపల్లి రూరల్: ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక స్పామ్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఉపాధి, శిక్షణ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాలు పొందడానికి జూలై 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను జూలై 25న పరిశీలిస్తారని తెలిపారు. అదే నెల 26న మెరిట్ జాబితా ప్రకటిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలకు జూలై 27, 28వ తేదీల్లో, ప్రైవేటు కళాశాలలో ప్రవేశాలకు జూలై 29, 30వ తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వివరాల కోసం స్థానిక కళాశాలలో వ్యక్తిగతంగా, లేదా సెల్ 98496 55419లో సంప్రదించాలని కోరారు.

నేడు నాటిక ప్రదర్శన

గుడివాడ టౌన్: స్పందన ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ ఆధ్వర్యంలో ఆదివారం వేణునాదం అనంతరం రాజుగారి గోచి సాంఘిక నాటిక ప్రదర్శించనున్నట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్ లోని జి.వి. పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాల్లో సాయంత్రం 6.30 గంటలకు విశాఖకు చెందిన మాస్టర్ వి. రోహిత్ సిద్ధ చే వేణుగానాలహరి, అనంతరం రాజుగారి గోచి సాంఘిక నాటిక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

కూచిపూడి నాట్యరంగానికి శాస్త్రి సేవలు ప్రశంసనీయం



రామలింగశాస్త్రి దంపతనులను సత్కరిస్తున్న సిబ్బంది



రామలింగశాస్త్రి దంపతులను సన్మానిస్తున్న కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నాట్య రంగానికి డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి చేసిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్దేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠం ప్రిన్స్‌పాల్‌గా రెండు దశాబ్దాలకు పైగా సేవలందించి ఎంతో మందిని కూచిపూడి నాట్య నిష్ణాతులుగా తీర్చిదిద్దిన ప్రిన్స్‌పాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా కళాపీఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ రామలింగ శాస్త్రి చేసిన సేవలను గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చింత రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసు, డాక్టర్ వేదాంతం దుర్గా భవాని, పర్యవేక్షకులు పార్థసారథి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావుతో పాటు కళాపీఠం సిబ్బంది, స్థానికులు కొనియాడి ఘనంగా సత్కరించారు.

శాస్త్రి సేవలు నిరుపమానం

పామర్రు: కళారంగానికి ఎన్నో సేవలను అందించి ఉద్యోగ విరమణ చేసిన వేదాంతం రామలింగ శాస్త్రి సేవలు నిరుపమానమని పామర్రు కళాపీఠం అధ్యక్ష,కార్యదర్శులు కాటూరి వెంకట మురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి పేర్కొన్నారు. రామలింగశాస్త్రి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా వీడ్కోలు సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది కళాకారులకు ఆయన సేవలు ఆదర్శ ప్రాయమన్నారు. ప్రతి కళాకారుడు ఆయన చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం రామలింగశాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించారు.

జాతీయ గణాంక దినోత్సవం



గణాంక దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

గుడివాడ టౌన్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల్లో శనివారం జాతీయ గణాంక దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ మాట్లాడుతూ డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడం అనేది విద్య ప్రక్రియను మెరుగుపరుస్తుందన్నారు. విశ్లేషణకు అది ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కావున గణాంకాలను అధ్యయనం చేసేందుకు విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో గణాంక శాస్త్ర విభాగాధిపతి పి. శ్రీదేవి, కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, బీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

గుడివాడరూరల్: ఆర్టీసీ హయ్యర్ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు శనివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు ఈనెల 28వ తేదీ సాయంత్రం అవనిగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ హయ్యర్ బస్సు నడుపుకుంటూ గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కిన్నెర కాంప్లెక్స్ వద్దకు వచ్చేసరికి రహదారి మధ్యలో కారును ఆపి ఉండటాన్ని గమనించిన డ్రైవర్ బస్సు హారన్‌ను కొట్టాడు. కారు డ్రైవర్ ఆ కారును తీయకపోవడంతో మరోసారి హారన్‌ను కొట్టి కారు పక్కకు తీయాలని బస్సు డ్రైవర్ కోరాడు. కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉండి ఆగ్రహంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేశాడు. వెంటనే పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలంతా గుమికూడటంతో కారు డ్రైవర్ కారు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం ఆర్టీసీ బస్సును డ్రైవర్ డిపోలోకి తీసుకెళ్లి టాయిలెట్‌కు వెళ్దామని బాత్‌రూమ్‌కు వెళుతున్న సమయంలో కారు డ్రైవర్ మరో వ్యక్తిని తీసుకుని బస్టాండ్‌కు వచ్చాడు. ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ బస్సు డ్రైవర్‌పై దాడి చేశాడు. దీంతో సదరు బస్సు డ్రైవర్ సరివెళ్ల రాకేష్ (చిరువోలు లంక గ్రామం, మోపిదేవి మండలం) టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టూటౌన్ సీఐ నాగదుర్గారావు ఆదేశాల మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి ఎస్ఐ నాగరాజు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మున్సిపల్ పన్నులు వెంటనే చెల్లించండి

గుడివాడ టౌన్: పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాలు, ఇంటిపన్ను, కుళాయిలకు అర్ధసంవత్సర పన్ను చెల్లింపునకు జూన్ 30వ తేదీతో గడువు ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే యజమానులు ఆస్తిపన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో కోరారు. జూలై ఒకటో తేదీ నుంచి చెల్లించే వారికి నెలకు నూటికి రూ. 2 చొప్పున అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో నాగలక్ష్మి

గుడివాడ టౌన్: విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందని ఏజీకే హైస్కూల్ విశ్రాంత హెచ్‌ఎం పుట్టి వెంకటేశ్వరరావు సామాజిక సేవా సంస్థ గుడివాడ అధ్యక్షురాలు పుట్టి నాగలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్ ఆవరణలో 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడానికి మార్గదర్శులైన ఉపాధ్యాయులను ఆమె సత్కరించారు.ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎంవీజే ఆంజనేయులు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు బ్యాంకులు రుణాలు అందించాలి



లూయిస్ డాగ్‌రే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

కైకలూరు: కెమెరాల కొనుగోలు నిమిత్తం ఫొటోగ్రాఫర్లకు బ్యాంకులు రుణాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు ఫొటోగ్రాఫర్లు కోరారు. జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా కై కలూరు నియోజకవర్గ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేషన్ రోడ్‌లో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్ రే విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటితరం యువ ఫొటోగ్రాఫర్లు మారుతున్న కాలంలో టెక్నాలజీని అందుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం వృత్తి నైపుణ్యా కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ అందించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీ సాగర్ బాబు, గౌరవాధ్యక్షుడు టీఎస్ ఆచారి, ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, మాజీ అధ్యక్షుడు కే సుమంత్, సభ్యులు సీహెచ్.ప్రేమ్ కిరణ్, కే బాలాజీ, నరేంద్ర, సతీష్, కిరణ్, టీ.జగదీష్, హర్ష, వెంకట్, బ్రహ్మాజీ, సీతారామయ్య పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ దినతేజ్

కైకలూరు: గ్రామాల్లో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలిదిండి ఎంపీడీఓ జి.దినతేజ్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వైద్య సిబ్బంది, సెక్రటరీలు, ఐసీడీఎస్ సిబ్బందితో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కలుషితమైన ఆహారం, పానీయాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విరేచనాలు, జ్వరం, తీవ్రమైన నొప్పి, బరువు తగ్గడం, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే ఆస్పత్రిలో కచ్చితంగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకరరావు పాల్గొన్నారు.

గ్రామసభలకు ఓటర్లంతా హాజరుకావాలి

మండవల్లి: జూలై ఒకటో తేదీ నుంచి జరిగే గ్రామసభలకు ఓటర్లంతా హాజరై భాగస్వాములై పర్యవేక్షించడం ద్వారానే అభివృద్ధి సాధ్యపడుతుందని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని గన్నవరంలో శనివారం గ్రామసభల నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రజలకు ఉన్న పాలనాధికారాన్ని తిరిగి నేరుగా ప్రజలకే దక్కేవిధంగా ప్రతి గ్రామంలో గ్రామసభల నిర్వహణ ఏడాదికి నాలుగు సార్లు జరిగేవిధంగా అవకాశం కల్పించారన్నారు. జి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీరామమూర్తి, బి.రామలింగం, అయ్యప్ప, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు అందజేత



తోట్లవల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ న్యాయవాది సూరి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని రొయ్యూరులోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయన శనివారం కుర్చీలు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని చిన్నారులకు కుర్చీలు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసినట్లు పవన్‌కుమార్ తెలిపారు. టీడీపీ మండల కార్యదర్శి లుక్కా రేణుకారావు, లుక్కా శివనాగబాబు, మోర్ల శ్రీను, రంజిత్, వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు మాలతి, శిరీషా పాల్గొన్నారు.

యాంకర్ భాస్కర్‌కు అవార్డు



ఐకాన్ అవార్డుతో యాంకర్ వెంకటభాస్కర్

కురుమద్దాలి(పామర్రు): కృష్ణాజిల్లా పామర్రు మండలం కురుమద్దాలి గ్రామానికి చెందిన ప్రముఖ యాంకర్ కర్రి వెంకటభాస్కర్ ‘నేషనల్ ఐకాన్ అవార్డు’ అందుకున్నారు. ఈ విషయాన్ని ఆయన శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 25వ తేదీన న్యూఢిల్లీలోని కమనీ ఆడిటోరియంలో భారత్ న్యూస్ భారతీయ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళారంగంలో తాను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్‌సింగ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. 2017లో విజయవాడ నగర పాలక సంస్థ ద్వారా నిర్వహించిన ‘హ్యాపీ సండేస్’ కార్యక్రమంతో యాంకర్‌గా జీవితం ప్రారంభించిన తాను పలు ప్రభుత్వ ఈవెంట్స్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. తన సేవలను గుర్తించి, భారతీయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాకారుల రంగంలో నేషనల్ ఐకాన్ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

సుబ్బారాయుడి హుండీ ఆదాయం రూ.13 లక్షలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానులను శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా స్వామికి రూ.13,00,795 ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ నేల సంధ్య, డివిజన్ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ తెలిపారు. స్వామికి 107 రోజుల్లో ఈ ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. అదేవిధంగా 5.7 గ్రాముల బంగారం, 750 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్ శొంఠి నాగరాజు, ఎస్సై డి. వెంకటకుమార్, వి.రామకృష్ణ, వీఆర్వో రామసుబ్బయ్య, వివిధ ఆలయాలకు చెందిన మేనేజర్లు, సిబ్బంది, శ్రీదుర్గాశివసాయి సంఘం సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ సభ్యులు శనివారం స్థానిక వాసవీ చౌక్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ముందు గల యాచకులకు దుప్పట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమైనందున యాచకులు వర్షంలో తడిచి, చలికి ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె. రామారావు, కె. రామకృష్ణ, సభ్యులు అర్జా ప్రసాదు, లింగం చిట్టిబాబు, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు చంద్రశేఖరశర్మ



పమిడిముక్కల: తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న హైస్కూల్లోనే ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన ఘనత తాడంకి హైస్కూల్ ఫిజికల్ సైన్స్ టీచర్ పాటిబండ్ల చంద్రశేఖరశర్మకు దక్కింది. తాడంకి హైస్కూల్లో శనివారం చంద్రశేఖరశర్మ ఉద్యోగ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా చంద్రశేఖరశర్మ 29 సంవత్సరాలు సేవలందించారు. చంద్రశేఖరశర్మ దంపతులను విద్యా కుటుంబం , గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం ప్రసాద్, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కూచిపూడి శ్రీలక్ష్మి, అభివృద్ధి కమిటీ సభ్యులు యేనుగ మస్తాన్‌రావు, గ్రామ పెద్దలు పులి శ్రీనివాసరావు, జక్కా శ్రీనివాసరావు, జక్కా గోవర్ధనరావు, పాలేటి ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంటాడ ఉపసర్పంచ్ రాజీనామా



పమిడిముక్కల: మంటాడ ఉపసర్పంచ్ గంగిరెడ్డి శివరామప్రసాద్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను శనివారం ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీకి అందజేశారు. వ్యక్తిగత కారణాలతో ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేసినట్లు శివరామప్రసాద్ తెలిపారు.

హెచ్‌ఎం శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయం



పమిడిముక్కల: హెచ్‌ఎం తాటిపర్తి శ్రీనివాసరావు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బోరగుడి హైస్కూల్లో హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన తాటిపర్తి శ్రీనివాసరావును శనివారం హైస్కూల్ విద్యా కుటుంబం, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

క్లోరినేషన్ పనుల పరిశీలన

మండవల్లి: మండవల్లిలోని వాటర్ ట్యాంక్ వద్ద క్లోరినేషన్ పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందజేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.



